# క్షణంలో సగం

"శారద"

(విద్యారావుగారు ప్రకటించనున్న నవ్యాంధ్ర నిఘంటువులో కొన్ని ముత్యాలు)

'తా' పట్టిన కుందేలు: ఒక అపూర్వమైన మూడుకాళ్ల జంతువు. కొందరు మనుష్యులకు మాత్రమే కనిపిస్తూ వుంటుంది.

తెల్లకాకి: ప్రతివాది తరఫు సాక్షులు తమ కళ్ళతో ప్రమాణపూర్తిగా చూచిన పక్షి.

సోషలిజం: ఎన్నికలు సమీపిస్తున్నకొలదీ ప్రతిపార్టీకి ఎదటి పార్టీల ఆశయాలలో కన పడని ఒక తత్వవిశేషం.

ఆంధ్రత్వం: సామర్లకోట సోడా గ్యాసు.

దేశభక్తి: కంట్రోలు లేని వస్తువు.

శాంతి: అగ్రరాజ్యాలు యుద్ధసన్నద్ధం కావ డానికి అవసరమైన విశ్రాంతి కాలం.

ఎం. ఎల్. ఏ: 'కుంభకర్ణుడి' వారసుడు.

పట్టమహిషి: ప్రభుత్వ జంతు శాలలోని బర్రె (గవిడిగేదె.)

రాజప్రముఖ్: రాజ్యం లేక పోయినా రాజరికం వున్న రాజు.

ప్రజా సామాన్యం: జనతా ఎక్స్‌ప్రెస్, జనం, పార్టీలాంటి వాటికి తెలియని కొన్ని జీవులు. (ట్రేడ్ మార్కుల నుపయోగించే నామవాచక విశేషం.)

పత్రిక: అమలులో వున్న ప్రభుత్వానికి తాళంవేసే భట్రాజు.

సంస్కరణ: ప్రతివాడూ చెయ్యాలనుకునేదీ "అనివార్య కారణాలవల్ల" విరమించేదీనూ.

మంత్రి: అవసరమైన వాటిని గురించి సనే మిరా ఆలోచించని పెద్ద వుద్యోగి.

ఎన్నికలు: ఏఏ పార్టీలో ఎన్నెని గ్రూపులున్నాయో, కొత్తపార్టీలు ఎన్ని లేవటానికి అవకాశం వుందో తేల్చే ముహూర్తం.

రసికుడు: తనకు తానుగా ఎల్లప్పుడూ కూనిరాగం తీసే వ్యక్తి.

వినోదం: 'లా' ప్రకారం పన్ను విధించ టానికి వున్న ఒకే సాధనం.

జానపదం: ఎవడికీ అర్థంకాని అపభ్రంశపు గొడవ.

హంసగమని: బస్తీలో నీళ్లల్లో పాలు గలిపి అమ్మే సొగసుపక్షి.

ఏనుగగున్న: రేషన్ యుగంలోనూ, నిగ లాడుతూ బలిసిన అబ్బాయి.

అచ్చోసిన ఆంబోతు: ఎస్. ఎస్. ఎల్. సి. మూడోఏడు తప్పి, సినిమాల దగ్గరా, గుళ్ళ దగ్గరా ఆడవాళ్ళని వెన్నాడే, సిగరెట్ పొగ మేస్తూ తిరిగే రెండుకాళ్ళ మనిషి.

విమర్శకుడు: ఫ్రీపాస్ ఇచ్చినా ఇవ్వక పోయినా ప్రతి సినిమామీదా రివ్యూ రాయ లేకపోతే బతకలేని ఒక తెలుగు సత్యవాది.

రౌడీ: పోలీసులకి భయపడి, పెళ్ళాన్ని బాదే మారీచుడు.

రెట్టమతం: అన్ని దేశాల్లోనూ వున్న మను ష్యులలో తగాదా లేకండా విపుల వ్యాప్తిలో వున్న ఒక పురాతన మతం.

భద్రతా సమితి: ఎవరెవరికి ఎప్పుడు యుద్ధం వస్తుందో, ఎవరు, ఇంకోరి దేశాన్ని ఎప్పుడు దురాక్రమణ చెయ్యవచ్చునో ముందుగానే తెలు పుడు చేస్తూవుండే జ్యోతిషాలయం.

పేషంటు: డాక్టర్లపాలిటి పాడి బర్రె.

ఎక్స్‌ట్రా నక్షత్రం: మద్రాసు పాండీ బజార్లో తిరుగుతూవుండే పేరులేని అమ్మాయి.

శాన్ ఫ్రాన్సిస్కో, అక్టోబరు 22: లెహనోవిస్కీ అనే కుక్క పియానో వాయిస్తుంది. గాయకుల సమితికి చెందినది కాదనే కారణమున శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన ఒక పాటకచ్చేరీలో ఈ కుక్కను పాల్గొన నివ్వలేదు.

# మనం బాగుపడే మార్గం?

ము. సం. గోపాలమూర్తి

"ఏరా గోష్ఠి, దేశోద్ధారక శ్రీ టోపీదాసు గారు యివాళ గ్రామచావడిదగ్గర ఉపన్యాసం యిస్తారుట. మనం కూడా వెళదామా?" అన్నాడు రాము. కాస్సేపు తటపటాయించాను ఆ ఊకదంపుడులోకి పోయి తలనొప్పి కొనితెచ్చుకోవట మెందుకని. కాని మావాడు నన్ను పీక్కు తింటూంటే వెళ్ళక తప్పిందికాదు.

గ్రామచావడి ముందున్న అరుగుమీద పూలు చల్లారు. టేబిలువేసి దానిమీద ముఖమల్ గుడ్డలు పరచటం అగరువత్తులు వెలిగించటం పూలగుత్తులు వుంచటం మొదలయిన పటాటోపం అంతా చేశారు. ఉపన్యాసకుడి నడుము బిగుసుకుపోతుందని మెత్తటి దిండ్లు కుర్చీలో వుంచారు. మేలురకపు సిల్కుతో తయారయిన జెండాల నెగురవేశారు. నేనూ రామూ వెళ్ళేటప్పటికి శ్రీ టోపీదాసుగారు తమాషాగా చేతులు తిప్పుతూ మధ్యమధ్య బంగారపు గుండీల్ని, గడియారాన్ని సవరించుతూ ఉపన్యాసం దంచేస్తున్నారు. నేనూ రామూ పోయి ఒకమూల కూలబడ్డాం.

"నా ప్రాణ మిత్రులారా! స్వాతంత్ర్యం సంపాదించి నాలుగేళ్ళయింది. అంటే దరిద్రం మనల్ని విడిచి నాలుగేళ్ళయిందన్న మాట. జమీందారీలని రద్దుచేశాం. రైతులకు కూలీలకు మేలుచేశాం. నిరుద్యోగుల కుద్యోగాలిచ్చాం. హైస్కూళ్లు, కాలేజీల సంఖ్య రెట్టింపుచేశాం. రేషనింగుపెట్టి ప్రజల ఆకలిమంటలను చల్లార్చాం. దాదాపు రామరాజ్యపు పొలిమేరల్లో వున్నాం. కొంతమంది ప్రబుద్ధులు ప్రభుత్వమేంచేసింది అని అడుగుతున్నారు. మనకు స్వాతంత్ర్యం వచ్చి నాలుగేళ్ళే అయింది. అనుభవం తక్కువ. అందుచేత పొరపాట్లు చేసి వుండవచ్చు. కాని ప్రస్తుతం మనం రామరాజ్యపు పొలిమేరల్లో వున్నామన్న సంగతి మరిచిపోవద్దు." ఇదీ శ్రీవారి ఉపన్యాసపు (కాదు ఊకదంపుడు) సారాంశం. రామరాజ్యాన్ని కూర్చిన దండకం పూర్తికాగానే శ్రీవారు కుర్చీలో ఆసీనులయినారు. ప్రజలు చప్పట్లుకొట్టక పోయేసరికి శ్రీవారి ముఖం కందగడ్డ అయింది. ఇంతలో నేను లేచి "అయ్యా! నాదొక విన్నపం" అన్నాను. శ్రీవారు నావంక తేరి పారచూచి "విన్నపాలుంటే వచ్చి బంగళాలో నన్ను కలుసుకో" అన్నారు. "నేను అయ్యా! మీ ఉపన్యాసంలో నాకు కొన్ని సందేహాలున్నాయి. కనక ప్రజలకుకూడా తెలియటానికై యిక్కడే సమాధానం చెప్పండి" అన్నాను. చింతనిప్పుల్లే కళ్లుచేసుకొని నావంక చురచుర చూచి వెంటనే పక్కనకూర్చున్నవారిచెవి కొరికారు. వారు అవతల వున్న పోలీసు ఇన్స్పెక్టరు వంక చూడగా ఆ పెద్ద మనిషి నన్ను దూషిస్తూ నా దగ్గరకొచ్చి లాఠీతో భుజంమీద పొడిచి మీటింగులోంచి పొమ్మన్నాడు. నాకు కోపంతో నరనరాలూ పొంగి శరీరం గజగజ మన్నది. ఆమట్టున ఏమయితే అయిందని మీదపడి పీక పట్టుకుందామనుకున్నాను. కాని వస్తాయించాను. ముందు శ్రీవారికి సమాధానం చెప్పాలి. ఎట్లా? ఏం జరుగుతుందా అని ఒళ్ళంతా కళ్లుచేసుకు చూస్తున్న జనం మధ్యలోకి ఒక్కదూకు దూకాను. వెర్రి ఆవేశంతో ఇంత గొంతుచేసుకొని "మీరు నిజంగా ప్రజానాయకులయితే ప్రజలలో ఒకణ్ణయిన నా విన్నపం వినండి" అని అరిచాను. శ్రీవారు కళ్లుమాత్రం వప్పగించి చూస్తున్నారు. పోలీసు సమీపిస్తున్నాడు. నేను వెంటనే ప్రజలవంక తిరిగి "ఈయన చెప్పినదంతా బూటకం. కాకపోతే నేను మాట్లాడతానంటే ఆయనకి భయం దేనికి? మీరైనా నేను చెప్పేది ఆలకించరా?" అన్నాను. వెంటనే ప్రజలు ఐక్యకంఠంతో "ఆయనను మాట్లాడనివ్వాలి" అని నినాదం చేశారు. శ్రీవారు కుర్చీలోంచి

లేచి "నేను వెళ్లుతున్నాను. ఆయన చెప్పేది మీరు వినవచ్చు. నాకు అర్జంటు పనివుంది" అని అరుగుదిగి కారుమీద బుర్రమన్నారు. కాని పోలీసు యిన్స్పెక్టరు మటుకు కాచుకూర్చున్నాడు. నేను మెల్లిగా అరుగువైపు బయలుదేరాను. అరుగుమీద యెక్కేటప్పటికి యిన్స్పెక్టరు నావంక నిప్పులు కక్కుతూ చూచాడు. నేను ప్రజలవంక చూచి మొదలు పెట్టాను.

"సోదరులారా! కోటగోడవలెనిలబడి మీరు నాకు చేసిన సహాయానికి నా ప్రాణాన్ని బలి యిచ్చినా బదులు తీరదు. దేశోద్ధారకులు వారి ఉపన్యాసం మొదట్లోనే నా ప్రాణ మిత్రులారా అని సంబోధించారు. వారి ఆ మాటకూ, కన్నుగీటి జరిపించిన యీ అకృత్యానికీ యేమైనా పోలిక వుందా? మీ కళ్ల ముందు జరిగిన దానికీ, వాక్స్వాతంత్ర్యమనీ, సభా స్వాతంత్ర్యమనీ చెవులు హోరు పుట్టేట్లు చేసే ప్రలాపాలకూ ఏమైనా సంబంధమున్నదా? ఒక మనిషి గుండెమీద చేయి వేసికొని హాయిగా నిద్రపోవటానికే ఆశలేకపోతే ఇక చెప్పేదేమిటి? కమ్యూనిస్టుల ఉనికి చెప్పమనో గవర్నమెంటుని నిందిస్తున్నావనో సామాన్యుడి వీపు పెట్లని రోజులేదు. వాళ్ళను పట్టుకోవటం చేతకాక గ్రామస్థులను పట్టుకొని బాల వృద్ధ నారి అన్న భేదం లేకుండా చితగ్గొట్టటం, నుజ్జునుజ్జు చేయటం, ధాన్యాన్ని గుడ్డలను బజార్లో పోగుచేసి కిరసనాయిలు పోసి తగలబెట్టటం. అదీ కాకపోతే పెద్దల్ని పిల్లల్ని గుడ్డలు విప్పదీయించి దిసమొలలతో గ్రామంలో వూరేగించటం. ఇలా జరుగుతూంటే మనం రామరాజ్యం సరిహద్దుల్లో వున్నామంటే అర్థం యేమిటి?

మనకు దరిద్రం తీరి నాలుగేళ్లయిందట. కొత్త "నడుం లేపగలవాళ్లు" ఆ రేషను బియ్యంతోనే సతమత మవుతున్నారు. ఆ రేషను కొంటానికి డబ్బు లేనివారు ఎంగిలి విస్తళ్లు (హోటళ్ల ముందు ఇటువంటి వారిని చూడవచ్చు) నాకి తృప్తిపడుతున్నారు. దానికీ గతిలేని వాళ్లు మలమల మాడి ప్రాణాల్ని విడుస్తున్నారు. మన దేశానికి రైతులు, కూలీలు, కార్మికులు వెన్నెముకవంటివారు. రైతుల స్థితి నానాటికీ తీసికట్టుగా వుంది. వ్యవసాయ పద్ధతులలో పురోభివృద్ధి లేక, భూస్వాముల దౌర్జన్యానికి పాల్పడి, ఎరువుల విషయంలో అధికారుల అవినీతికి లోబడి అటు పూర్వ పద్ధతికీ, యిటు కొత్తపద్ధతికీ చెడి బైరాగులయినారు. మధ్యలో ఈ ప్రొక్యూరుమెంటు వచ్చిపడి ఉన్న బూడిదను కూడా దులుపుకుపోతున్నది. కూలీలు, కార్మికులు యిక సరేసరి. ఏ రోజు కూలి రాకపోతే ఆ రోజు వారి జీవితం ఒక కొలిక్కి వస్తుంది. దేశానికి వెన్నెముక అయిన వీరి స్థితే యిలా వుంటే ఆశ్చర్యపడవలసిన అవసరంలేదు. "దేశంలోని అతి సామాన్యుని అవసరాన్ని గుర్తించినప్పుడే ఆ ప్రభుత్వం స్థిరంగా ఉండగలదు" అన్నాడొక రాజకీయ శాస్త్రాచార్యుడు. మన దేశంలో అతి సామాన్యుల సంఖ్య యెంతో వారి అవసరాలు యెంతవరకు గుర్తించబడినాయో మనము చూస్తూనే వున్నాము. ఒకవేళ కాంగ్రెసు ప్రభుత్వానికి తెలియకపోతే ఫ్రెంచి విప్లవాన్ని గురించి పుస్తకాలు తిరగవేయటం మంచిది.

జమీందారులు, భూస్వాములు దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు ఫ్రాన్సులో చాలా భాగం తమ కిందకు తెచ్చుకొని, పొలాలను అంతులేని కవుళ్ళకు యివ్వసాగారు. దీనికి తోడు లూయీ చక్రవర్తి, మతాధికారులు యిష్టం వచ్చినట్లు పన్నులువేసి రైతులను పిండారు. దీనితో మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లయింది రైతులకు. దీనికి మళ్ళా అధికారుల లంచాలు తోడైనవి. దీనితో రెచ్చిపోయి రైతులు, కార్మికులు తిరగబడి విప్లవం తెచ్చారు. ప్రజలు రెచ్చిపోయిన తరువాత దాని నాపగల శక్తి ఈ భూప్రపంచంలో లేదు. ప్రజలతో చెలగాటం సింహం జూలు పట్టుకుని ఉయ్యాల ఊగటం అన్నమాట.

పై కారణాలు యిప్పుడు మనదేశంలో బాగా ప్రబలి ఉన్నాయని మరచి పోవద్దు. జమీందారీలను రద్దు చేశామన్న మాటేగాని, వారిప్పటికీ మారు రూపాలతో కాంగ్రెసుకు వెన్నెముకగా వున్నారు. భూస్వాములు, కవుళ్లు మొదలయినవి రైతుల యీతి బాధలు, కూలీల

కార్మికుల భూలోక నరకవాసాలూ ఉండనే వున్నవి. నిరుద్యోగంతో అసంతృప్తి బాగా కనిపిస్తున్నది. భావి జీవితాల్ని గురించి గ్యారంటీ లేక విద్యార్థులు నిస్సారమయిన జీవితం గడుపుతున్నారు. వీరి పాలిటికి ఏలినాటి శనియై కమ్యూనల్ జీ. వో. అంటిపెట్టుకొని వున్నది. అన్నిటినీ మించి కాంగ్రెసు ప్రభుత్వంలో లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం, అంతః కలహాలు, ప్రజాద్రోహాలు, మత దురభిమానాలు మొదలయిన కామెర్ల లక్షణాలన్నీ మూర్తీభవించినయ్. దాని కళ్ళకి లోకం అంతా పచ్చపడి పోయింది. ఇది చాలదా దానియొక్క పతనాన్ని సూచించడానికి?

ఎన్నికలొస్తున్నాయ్. కాని—

బ్రహ్మాని తిమ్మిని చేయగలవాళ్లున్నారు దీంట్లో. ఏ పదవుల కోసమైతే, ఏ వాటాల కోసమైతే తమ నిజాయితీని గాలికి విడిచారో వారే మళ్ళా తమ గ్రూపుల స్థిరత్వం కోసం అంటే పదవుల స్థిరత్వంకోసం ప్రజలను మోసగిస్తారు. డబ్బు ఆశ చూపుతారు. పదవుల ఆశ చూపుతారు. అరచేతిలో స్వర్గం చూపిస్తారు.

ఇటువంటి సమయంలోనే ప్రజలు నిగ్రహం వివేకం చూపాలి. వెంటనే వలలో పడకూడదు.

"వీళ్లు పదవులకు వెళ్ళకముందు మనముందు యెంత 'ప్రదర్శనం' చేశారు? పదవులకి ప్రాకిన తరువాత మళ్ళీ మన ముఖం చూశారా? తమ మీద ప్రజలకు అనుమానం వున్నప్పుడు ఆ అనుమానాన్ని పోగొట్టుకోటానికి కనీసం ప్రయత్నం చేశారా? తమ మీద భూస్వాముల, ధనికుల వత్తిడి అదివరకు కంటె తగ్గిందా? హెచ్చిందా? కడుపునిండా అన్నం తింటున్నామా?" అన్న ఆలోచన క్షుణ్ణంగా చేయాలి.

నిజాయితీ గలవాళ్లు, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసేవాళ్లు ప్రతినిధులుగా ఉండాలంటే వెనకటి మాదిరిగా ఉపన్యాసం విని వేలంవెర్రిగా ఓట్లు వేయటం పనికిరాదు. ఆ పద్ధతులన్నీ ఏరుదాటిన తర్వాత తెప్ప తగలేసే పరిస్థితిని కల్పిస్తాయి. అంతా అయిన తర్వాత ఆకులు పట్టుకుంటే లాభంలేదు. వచ్చిన అభ్యర్థిని నిలవదీసి ప్రశ్నలడిగి కంట్రాక్టు వ్రాసుకోవలసిందే.

1. నెలకు ఇరవై రోజులు తన నియోజక వర్గంలో తిరుగుతూ వారి క్షేమానికి పాటుబడటం.

2. తన నియోజక వర్గంలోని ప్రజలకు హాని కలిగించే పనులను ప్రభుత్వం తలపెడితే నిరసన తెల్పి రాజీనామా యివ్వటం.

3. ఎమ్. ఎల్. ఏ. ప్రాక్టీసు (ప్లీడరులాగా పనిచేసి డబ్బు చేసుకోవటం) అనగా పర్మిట్లు బస్ రూట్ల కోసం గడ్డి తినటానికి పాల్పడనని ఖరారునామా.

4. అసెంబ్లీలో చేరిన నాల్గునెలలలో తన నియోజక వర్గంలో పురోభివృద్ధి కనుపించక పోతే రాజీనామా యివ్వటం.

5. తనమీద ప్రజలకు అనుమానం కలిగినపుడు ప్రజల తీర్పుకు సిద్ధపడటం.

ఈ కంట్రాక్టు పరస్పరం వ్రాసుకుంటే యిబ్బంది ఉండదేమో. నిజాయితీగా నడచుకొని ప్రజాసేవ చేయాలని అనుకొనే అభ్యర్థి నిరాటంకంగా కంట్రాక్టుమీద సంతకంచేస్తాడు. ద్రోహి అయితే ఆ చాయలకే రాడు. ఇక ముందు ఎన్నికలలో ఇది ప్రవేశ పెడితే దేశం ముఖాన ఏమయినా బాగుపడే రాత ఉంటుందేమో! లేకపోతే ఫ్రెంచివిప్లవం పునరావృత్తం కాకమానదు!

---

నిష్పాక్షికమైన ఎన్నికలు జరుపుతామని అంటున్నారు. భారత ప్రధాని ప్రతి సుప్రభాతాన మహోదార పూర్వకమైన ప్రకటనలు చేస్తారు. సాయంత్రం అయ్యేసరికి సూర్యాస్తమయంతో బాటు అవీ ఆచరణలో అస్తమిస్తూ ఉంటాయి. మంత్రులు వాస్తవానికి ఢిల్లీ కాంగ్రెసుసభలకోసం వెళ్ళారు. కాని ప్రభుత్వ పనులగూర్చి మాట్లాడామని ప్రయాణపు బత్తాలు తీసుకొంటారు.

— తెన్నేటి విశ్వనాథం




సంపాదకునికి ప్రకటనార్థం పంపించిన లేఖలు యీ శీర్షికక్రింద ప్రచురిత మవుతాయి. లేఖలు క్లుప్తంగా, కాగితానికి ఒక పక్క వ్రాసి పంపాలి.

---

## "మతోన్మాదకర" భావాలు

ప్రస్తుతం ప్రచురింపబడు పత్రికలలో ఏ విధమైన పార్టీ పక్షపాతము వహించక నిష్పక్ష బుద్ధితో, నిర్మాణాత్మకంగా విమర్శ చేయునది మీ పత్రిక ఒకటియే యని చాలామంది అభిప్రాయం. మీ సంపాదకీయములు (తెలుగు పత్రికలలో) చదువుచున్న కొలది మీ నిష్పక్షపాత బుద్ధి దినదినమూ ఋజువగుచున్నది.

మీరు సంపాదకులుగా యుండిన పత్రికలో ప్రచురింపబడు ఇతర వ్యాసములకు బాధ్యత కూడా మీరే వహించవలసి యున్నది గదా! అందువలన ఆ వ్యాసములను మరికొంత జాగ్రత్తగా పరిశీలించి ప్రచురించుట మరీ మంచిది.

ఈమధ్య నెహ్రూను మీ సంపాదకీయములలో నిర్మాణాత్మకముగా విమర్శించుట చాల సమంజసముగా వున్నది. కొంత మంది మీ పత్రికలో నెహ్రూను విమర్శించుట యందు మిమ్ములను అనుకరించుచున్నట్లు నటించుచు వారి సహజస్థితిని ప్రకటించుకొనుచున్నారని వ్రాయుటకు చాల విచారించవలసి వచ్చుచున్నది. ఆ వ్యాసములందు నెహ్రూను నిర్మాణాత్మకముగా విమర్శించుటకంటె చాల మటుకు హిందూమహాసభనో, ఆర్. యస్. యస్. నో సమర్థించుట కనపడుచున్నది. ఉదాహరణకు సెప్టెంబరు 19 సంచికలో "టి.యల్. యన్" గారిచే వ్రాయబడిన "నెహ్రూ — కమ్యూనలిజం" అను వ్యాసమును చదివిన అర్థము కాగలదు.

కనుక యిటువంటి వ్యాసములు ప్రచురింపబడుటవలన సంపాదకీయములు అంత నిష్పక్షపాతముగను, నిర్మాణాత్మకముగను ఉన్నప్పటికీ మీ పత్రికకూడ మతోన్మాదకరమైన భావములకు తావిచ్చునదిగా భావించబడుటకు అవకాశము గలదు. అందువలన ఇంతవరకు ఏ ఉన్నత భావముతో మీ పత్రిక చూడబడుచున్నదో అంతటి ఉన్నతస్థితిలో చూడబడక పోవచ్చును. ఇకముందు అటువంటి వ్యాసములకు తావివ్వకుందురుగాక.

తెనాలి — చిల్లర బాలకృష్ణరావు

---

## కర్నూలు జిల్లా రైతాంగం మొర

కర్నూలు జిల్లాలోని కోవెలకుంట్ల తాలూకాలో 1945 సంవత్సరములో రూపాయకు పది అణాల పంట పండింది. అప్పటినుంచి ఈ రోజువరకు వేరుశెనగ, ప్రత్తి, బొత్తిగా పండ లేదు. పోయిన సంవత్సరము జొన్న బొత్తిగా పండలేదు. అంతకుముందు సంవత్సరములో ఒక చేను పండిన, ఒక చేను పండక సగటున రూపాయకు పావలా పైరు జొన్న పండినది. మా గ్రామమయిన నొసములో చిన్న చెరు వుంది. ఈ చెరువుకు మా వూరి కొండమీద కురిసిన వర్షమే ఆధారము. ఈ చెరువు క్రింద రెండు వందల యెకరముల మాగాణి భూమి కలదు. నాలుగు, మూడు సంవత్సరములనుండి క్రింది పైరులకు చెరువు నీరు చాలక ఆఖరున పైర్లు యెండిపోవుచున్నవి. ఈ చెరువు లేవన్న

మంచిదేమో అని నాకు తోచుచున్నది. పేద రైతులు వరి నాటుటకు, కలుపులకు ఎంతో డబ్బు ఖర్చుచేస్తే, ఆఖరున వారికి లభించునది యెండిపోయిన బొందు. ఈ సంవత్సరం జూన్ నెలలో మంచి వర్షములు కురిసినందువలన మా చెరువు నిండినది. రెండు పైరులు వరి పండించ వచ్చుగదా యని పేద రైతుల ఆనందము చెప్ప నలవికాదు. కాని ఆశలు నిరాశలయినవి. "గ్రో-మోర్ ఫుడ్ (అధికోత్పత్తి) ప్రణాళిక క్రింద చెరువు తూములు రిపేరు చేయించారట. ఇదేమి రిపేరో కాని, చెరువు తూములు మూసినను, తూము తెరచినప్పుడు పోయే నీటికంటె ఎక్కువ నీరు పోవుచున్నది. ఇప్పటికీ చెరువులో అయిదవ వంతు నీరుమాత్రమే వున్నది. మొదటి వరిపైరు రెండు నెలలకిగాని ఇంటికి రాదు. చెరువునీరు చాలదని ఆయుర్దా ఎక్కువై నీటివద్ద అప్పుడే పోట్లాట లెక్కువయినవి.

తుంగభద్రా ప్రాజెక్టు ప్రారంభంలో మాకేదో ఉపయోగ ముండునని సంతసిల్లితిమి. దానివల్ల మాకు ఉపయోగము లేదని తెలిసికొని నిరాశ చెందితిమి. కృష్ణా - పెన్నారు ప్రాజెక్టు కాల్వ ఒకటి మా తాలూకా గుండా పోవునని తెలిసికొని ఆనందించితిమి. మా దారిద్ర్యం తీరురోజు వచ్చె గదాయని కలలు గంటిమి. ప్లానులు గీయుటకు వచ్చిన సూపర్ వైజర్లను శని దేవతను పారదోలుటకు వచ్చిన దేవ దూతలుగా భావించి ఆదరించితిమి. పులిచింతల ప్రాజెక్టుకే ప్రాధాన్య మియ్యవలయునను ప్రకటనలు తీర్మానములు పత్రికలలో చదివి కంట నీరు పెట్టుచున్నది రైతాంగము.

నోసము   రామాయణం రంగయ్య




మీ బ్రాంకైటిస్‌ను వదుల్చుకుని
శ్వాసము సులభతర మొనర్చుకొండి.

అద్భుతమైన ఈ పెప్స్‌ను
వైద్యులు ఈ క్రిందివాటి
నివారణకు సిఫారసు చేస్తారు:

దగ్గులు, జలుబులు, కుదుపు, **PEPS**
గొంతుపుండు, ఇన్‌ఫ్లుయెంజా, బ్రోంకైటిస్,
మరియు రొమ్ము, శ్వాసకోశ సంబంధమైన ఇతర
సమస్త వ్యాధులకు.




బ్రాంకైటిస్ చాలా ప్రమాదకరమైనది. దాని నివారణ సాధనం పెప్స్ బిళ్లలే. పెప్స్‌ను చప్పరిస్తే, దాని పరిమళభరితమైన, ఔషధప్రాయమైన సారములు మీ శ్వాసతో కలిసి, మీ శ్వాస నాళాలద్వారా శ్వాసకోశంలో ప్రవేశిస్తాయి. పెప్స్ వాపులను మాన్పి, పుండును, మంటను నివారిస్తుంది. ప్రమాదకరమైన సూక్ష్మక్రిములు మరింత హానిచేయడానికి పూర్వమే వాటిని పెప్స్ సంహరిస్తుంది; పెప్స్ శ్వాసను సులభతర మొనర్చుతుంది. పెప్స్ బిళ్లలు అద్భుతమైనవి.

పెప్స్ ఆంటిసెప్టిక్ గొంతు, రొమ్ము బిళ్లలు

# తెలుగు స్వతంత్ర

| | | | | |
|---|---|---|---|---|
| సాలు చందా | ... | ... | రూ. | 12-0-0 |
| అర్థ సం॥ చందా | ... | ... | రూ. | 6-0-0 |

## విడిప్రతి నాల్గణాలు

అర్థ సంవత్సరముకంటె తక్కువ కాలమునకు చందా అంగీకరింపబడదు.

## ప్రకటన రేట్లు

కాంట్రాక్టు :

(సాలుకు 24 లేక అంతకు మించినపర్యాయములు ప్రకటించువారికి కంట్రాక్టు రేట్లు వర్తిస్తవి)

| | | | | |
|---|---|---|---|---|
| పూర్తి పేజీ | తడవకు | ... | రూ. | 80-0-0 |
| అర పేజీ | ,, | ... | రూ. | 45-0-0 |

క్యాజుయల్ ప్రకటనలు :

| | | | | |
|---|---|---|---|---|
| పూర్తి పేజీ | తడవకు | ... | రూ. | 90-0-0 |
| అర పేజీ | ,, | ... | రూ. | 50-0-0 |

## కవరు పేజీల రేట్లు ప్రత్యేకము

మిగతా వివరములకు వ్రాయండి :

### తెలుగు స్వతంత్ర

160, లాయిడ్స్ రోడ్డు, రాయపేట మద్రాస్-14.



మలేరియా
మా బిడ్డను ఒక ఊపు
ఊపేసింది!

## తుదకు దానికి 'పాలుడ్రిన్' శరణ్యమైనది



అసలు మా బిడ్డను మేన మామ ఇంటికి తీసుకువెళ్లక పోతేనే బాగుండేదనిపించింది. బడికి మరల చేరవలసిన రోజునే, అది మలేరియా మూలంగా మంచం పట్టింది. కొద్దివారాలలోనే నీరసపడి, తడపలాగ అయిపోయింది. జ్వరతీవ్రత దానిని కుదిపేసింది. ఎవ్వరూ దానిని ఆపలేకపోయారు. తరవాత, ఒక మిత్రుని సలహాపై బిడ్డకు రోజూ ఒక 'పాలుడ్రిన్' బిళ్ల ఇస్తూవచ్చాము. మూడు నాలుగు రోజుల లోపున జ్వరం మాయమైనది. అప్పటినుండి మేమందరమూ ప్రతి ఆదివారం భోజనానంతరం ఒకొక్క 'పాలుడ్రిన్' బిళ్లను సేవిస్తున్నాము. మళ్లా మాకుటుంబంలో ఎవ్వరికీ మలేరియా సోకలేదు.

**ICI పాలుడ్రిన్** (ట్రేడ్ మార్క్)

మలేరియా నివారణకు దివ్యౌషధం

ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ (ఇండియా) లిమిటెడ్

R.P. 141-T.

Edited, Printed and Published by KHASA SUBBA RAU, at *Swatantra Printers*, 160, Lloyds Road, Royapettah, Madras.